సాక్షి
నల్లగొండ

బుధవారం ♦ 29 ♦ నవంబర్ ♦ 2023



మోదీ, కేసీఆర్.. ఇద్దరూ ఒక్కటే
ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్.. ఇద్దరూ ఒక్కటేనని ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి అన్నారు. - 2లో



'డబుల్ ఇంజన్'తోనే అభివృద్ధి
నల్లగొండ అభివృద్ధి డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యమని కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. - 2లో



అవినీతి ప్రభుత్వాన్ని తరిమేయాలి
రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అవినీతి ప్రభుత్వాన్ని తరిమేయాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. - 2లో

న్యూస్‌రీల్

మద్యం షాపులు బంద్

నల్లగొండ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వైన్ షాపులు, బార్లు బంద్ చేయడంతోపాటు మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారులు మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి ఈ నెల 30న సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసేంత వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని మద్యం వ్యాపారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు మద్యం అమ్మకాలు నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు.

30న కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు

నల్లగొండ: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని కర్మాగారాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వేతనంతో కూడిన సెలవు ఇస్తున్నట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎం.రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులంతా గురువారం తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

తైక్వాండో అసోసియేషన్ ఇన్‌చార్జ్‌ల నియామకం



నియామక పత్రం అందజేస్తున్న శ్రీహరి

నల్లగొండ టూటౌన్: తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్‌లుగా నాగిళ్ల రమేష్, చింత అనిల్‌కుమార్‌ను నియమిస్తూ తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురువ శ్రీహరి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో వీరిద్దరికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను నియమించిన అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ విద్యార్థులను తైక్వాండోలో రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు.

మహనీయుడు.. మహాత్మా జ్యోతిరావ్‌పూలే



జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: సమాజంలో సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్‌పూలే అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలో ఆ సంఘం ఆధ్వర్యంలో 133వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సాగర్ రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయం, విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించి తమలపాకులతో ఆకు పూజ చేశారు. నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించి కోర్కెలు కోరుకున్నారు. ఆలయంలో వందలాది మంది దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



ఎన్నికల ప్రచారం చివరిరోజైన మంగళవారం నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని త్రిపురారంలో బీఆర్‌ఎస్ రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు



మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చౌటుప్పల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

ష్.. గప్‌చుప్!

ముగిసిన ఎన్నికల ప్రచారం

- ఆఖరి రోజు అభ్యర్థుల హడావిడి
- రోడ్‌షోలు.. బైక్ ర్యాలీలు.. కార్నర్ మీటింగ్‌లు
- నామినేషన్ల రోజు నుంచి హోరెత్తిన ప్రచారాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర నేతల పర్యటన
- 12 నియోజకవర్గాల సభల్లో పాల్గొన్న సీఎం కేసీఆర్



ఎన్నికల ప్రచారం ముగియడంతో నల్లగొండలో ఫ్లెక్సీలు, మైకు తొలగిస్తున్న వాహనదారులు

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రచార పర్వానికి తెర పడింది. ఇంకా ఒక్క రోజు గడిస్తే ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ మొదలు కానుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మంగళవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగిసింది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఐదుగురి కంటే తక్కువ మందితో కలిసి ఇంటింటి ప్రచారం చేసుకునే వీలుంది. ఈ నెల 3వ తేదీన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నికల కోలాహలం మొదలైంది. రోడ్‌షోలు, బైక్ ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు, భారీ సభలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఆ పార్టీల జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారంలో పాల్గొన్నారు. ఇక, ప్రచారానికి ఆఖరి రోజైన మంగళవారం అభ్యర్థులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించి బల ప్రదర్శనకు దిగారు.

హేమాహేమీల ప్రచారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పన్నెండు నియోజకవర్గాల్లో పోటాపోటీగా అభ్యర్థులు ప్రచారం చేశారు. తమ అభ్యర్థుల గెలుపుకోసం ఆయా పార్టీల రాష్ట్ర నాయకత్వాలు, జాతీయ నాయకులు ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున సీఎం కె.చంద్రశేఖర్‌రావు 12 నియోజకవర్గాల్లో సభల్లో పాల్గొన్నారు. కేటీఆర్, హరీష్‌రావుల సభలు, రోడ్ షోలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు ప్రచారం చేశారు. ఇక బీజేపీ అభ్యర్థుల తరఫున కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఈటల రాజేందర్, మంద కృష్ణ మాదిగ, పవన్‌కల్యాణ్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. సీపీఎం అభ్యర్థుల తరఫున సీతారాం ఏచూరి, బృందాకారత్ రోడ్‌షోలలో పాల్గొన్నారు.

డబ్బు, మద్యం పంపిణీకి సన్నద్ధం..!

ఓటర్లను నోట్ల కట్టలతో కొనడానికి రంగం సిద్ధమైంది. ఓటర్లకు డబ్బులు పంచడం ఆనవాయితీగా మార్చుకున్న ఆయా పార్టీలు ఆ ఏర్పాట్లలో మునిగిపోయాయి. ప్రధానంగా నియోజకవర్గాల్లోని ఏయే గ్రామాల్లో తాము బలహీనంగా ఉన్నామో ఇప్పటికే గుర్తించిన ఆయా పార్టీల నాయకులు, సదరు గ్రామాల్లో ఓట్ల కొనుగోలుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల ఓటుకు రూ.1000, మరికొన్ని చోట్ల రూ.2 వేల చొప్పున పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. డబ్బుతోపాటు మద్యం కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల ఇప్పటికే క్వార్టర్ మందు, థమ్సప్ బాటిళ్ల పంపిణీని షురూ చేశారు.

ప్రతి వంద ఓట్లకు ఒక ఇన్‌చార్జి

పోలింగ్ రోజున చేపట్టాల్సిన ఏర్పాట్లపై రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ముఖ్యంగా పోల్ మేనేజ్‌మెంట్‌పైనే ఆశలు పెట్టుకున్నాయి. ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చి ఓటు వేయించుకునే ప్రయత్నాల్లో నిమగ్నం అయ్యాయి. అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించి ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. ఆ ఇన్‌చార్జిలు ఇప్పటికే పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల వివరాలను దగ్గర పెట్టుకొని అందరినీ కలిశారు. ఇక వారికి అవసరమైన డబ్బు, మద్యం పంపిణీ, ఆ ఓటర్లను గురువారం పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేలా చూడటంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.


మరోవైపు గిఫ్ట్‌ల రూపంలోనూ ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తెలిసింది. ప్రత్యర్థి అనుచరులు డబ్బుల పంపిణీని అడ్డుకునేందుకు గస్తీ కాయడం మొదలుపెట్టారు. ఎక్కడా డబ్బులు నిల్వ చేశారని అనుమానం ఉన్నా వెంటనే ఫిర్యాదు చేస్తున్నారు.

భారీగా పట్టుబడిన మద్యం..

మద్యం విక్రయాల కట్టడికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుపోవడంతో మద్యం అక్రమ నిల్వలు పట్టుబడ్డాయి. కేసులూ నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 3.07 లక్షల లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వైన్ షాపులు, మద్యం అక్రమ నిల్వలు, రవాణా తదితర అంశాల్లో ఏకంగా 2,592 కేసులను నమోదు చేశారు. ఎక్సైజ్ శాఖ ఇంతగా దృష్టి సారించినా.. ఆయా పార్టీల అభ్యర్థులు ఓటర్లను మద్యంలో ముంచెత్తేందుకు ఎక్కడికక్కడ నిల్వ చేశారని తెలుస్తోంది.



మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు



'పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదు. నల్లగొండను కేసీఆర్ దత్తత తీసుకుని ఒక్క రోడ్డు వేసి ఇంకా దత్తత అయిపోలేదని మాయమాటలు చెబుతుండు. ఆ మాటలు నమ్మితే మళ్లీ మోసపోతాం. బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. నన్ను గెలిపిస్తే మీ సేవకుడిగా పని చేస్తా. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. అందరి కష్టాలు తీరుస్తాం. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేయడంతోపాటు పేదలకు ఇళ్లు నిర్మిస్తాం' అని అంటున్నారు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే..

-నల్లగొండ

interview

అధికారంలోకి వస్తాం.. అందరి కష్టాలు తీరుస్తాం

- ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం
- బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- అవకాశమివ్వండి మీ సేవకుడిగా పనిచేస్తా
- మీ పిల్లల్లో నా కొడుకును చూసుకుంటా..

'సాక్షి'తో కాంగ్రెస్ నల్లగొండ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ నియోజకవర్గ ప్రజలు నన్ను ఎంతో ఆదరించి 20 ఏళ్లు ఆశీర్వదించారు. ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేను. గత ఎన్నికల్లో కేసీఆర్ దత్తత పేరుతో మాయమాటలు చెబితే ఆ పార్టీకి అవకాశం ఇచ్చారు. కానీ, నల్లగొండలో ఐదేళ్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వల్ల జరిగిన అభివృద్ధి ఏమీ లేదు. ఒక్క రోడ్డు వేసి అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్నారు. నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడే నల్లగొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశాను. అప్పటి సీఎం వైఎస్‌ఆర్‌ను ఒప్పించి శ్రీశైలం సొరంగ మార్గం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులను మంజూరు చేయించాను. 250 ఎకరాల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్మించా. పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతుంటే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాను. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి తప్ప నల్లగొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ చేసింది ఏమీ లేదు.

శత్రువును ప్రేమించే గుణం నాది..

ప్రస్తుత ఎమ్మెల్యే కేసీఆర్‌లా నియంతలా వ్యవహరిస్తూ తొక్కి చంపుతా అని బెదిరిస్తున్నారు. అంతే కాదు భూకబ్జాలు, అక్రమ దందాలు పెరిగిపోయాయి. నాకు అవకాశం ఇవ్వండి. నల్లగొండలో రౌడీయిజం లేకుండా చేస్తా. శత్రువును ప్రేమించే గుణం నాది. నా కొడుకు పేరున ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేద వారిని ఆదుకుంటున్నా. మీ పిల్లల్లో నా కొడుకును చూసుకుంటా. నా కూతురు పెళ్లి అయిపోయింది. నాకు మీ సేవ తప్ప మరొకటి లేదు. నల్లగొండలోనే ఉంటా. మీతో బతకాలని వచ్చా. మరోసారి ఆశీర్వదించండి. నాతోపాటు ఎన్నికల్లో నా భార్య, కూతురు మీ వద్దకు ఓటు అడగడానికి వచ్చారు. సమయభావం వల్ల కొందర్ని కలువలేకపోయా. 30వ తేదీన చేయి గుర్తుపై ఓటేసి నన్ను అధిక మెజార్టీతో గెలిపించాలి.

ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం..

అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. కాంగ్రెస్ 24 గంటల కరెంట్ ఇస్తుంది. గ్రూప్‌–2 ఉద్యోగాలతో పాటు మిగతా ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తాం. విద్య వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల ఇస్తాం. నల్లగొండలో ఐటీ పార్కు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. పాటు ఇళ్లు లేని వారికి ఇల్లు, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు మంజూరు చేస్తాం. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తాం. ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అవకతవకల వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని దీనికి కారణం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేతకానితనమే. మాయ మాటలు నమ్మి బీఆర్‌ఎస్‌కు ఓటేసే గోస పడతాం. విజ్ఞులైన ప్రజలు ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటేయాలి.

కేసీఆర్‌ది దొంగ దీక్ష

తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసింది దొంగ దీక్ష, ఆస్పత్రిలో మెడిసన్ తీసుకుని ఆయన దీక్ష చేశారు. అందుకు నా దగ్గర ఆధారాలున్నాయి. మణిపూర్‌లో ఒక మహిళ 13 ఏళ్లు మెడిసన్ తీసుకుని దీక్ష చేసింది. విద్యార్థులు, యువకుల ఆత్మబలిదానాలతో తెలంగాణ వస్తే కేసీఆర్ కుటుంబం తెలంగాణ సాధించినట్లుగా చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు ఏ మేలూ జరగలేదు. రైతు బంధు అమెరికాలో ఉన్న వారికి ఇస్తుంది. మంత్రి మల్లారెడ్డి కూడా తీసుకుంటున్నాడు. కేసీఆర్‌ది అంతా ఉన్న వారిని దోచి పెట్టడమే.

కాంగ్రెస్ మోసం చేసింది.. బీఆర్‌ఎస్ అణచివేసింది

- ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తామన్న బీజేపీని గెలిపించండి
- చండూరు సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, చిత్రంలో బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

చండూరు: ముప్పై ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాంగ్రెస్ మోసం చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులను అణచివేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ చండూరులో ఏర్పాటు చేసిన మాదిగల సమరభేరి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సహకరిస్తామని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ ఇవ్వడం వల్లే ఈ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు మాదిగలకు వివరించారు. నేను ఏదిచేసినా మాదిగల అభ్యున్నతి కోసమేనని.. నన్ను నమ్మి బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. నా జాతి అభివృద్ధి కోసమే ఏ పార్టీలో చేరడం లేదని, ఎస్సీ వర్గీకరణ సాధించి నా జాతి బిడ్డలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు నిమ్మరసం ఇచ్చి ప్రాణం కాపాడితే దానికి ఫలితంగా నన్ను రెండుసార్లు జైల్లో పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితున్నీ ముఖ్యమంత్రి ఎందుకు చేయలేదని, మూడెకరాల భూమి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినందుకు కేసీఆర్ నన్ను జైల్లో పెట్టారన్నారు.

మాదిగలంతా బీజేపీని ఆదరించండి

మాదిగల చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణ చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించనందున మాదిగలంతా బీజేపీని ఆదరించి తనకు ఓటెయ్యాలని ఆ పార్టీ మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి కోరారు. ఈ సభలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, దూడల భిక్షం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, మండల అధ్యక్షుడు ఇరిగి దుర్గాప్రసాద్, దర్శనం వేణు, చిలుక జయరాం, గోపీనాథ్, చరణ్ పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం

కబడ్డీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్‌లో ఇటీవల కబడ్డీ అసోసియేషన్ నల్లగొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకుడు రవికుమార్, సంయుక్త కార్యదర్శి చంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రామినేని భూలోకరావు, ఉపాధ్యక్షులుగా వెంకటరత్నం, దోమ్నిక్, ప్రధాన కార్యదర్శిగా జి.కర్తయ్య, సహాయ కార్యదర్శులుగా జంగా లక్ష్మణ్ యాదవ్, శ్రీకాంత్, అంజయ్య, కోశాధికారిగా చంద్రయ్య ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భూలోకరావు, కర్తయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కబడ్డీ క్రీడాకారులను గుర్తించి మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కమిటీ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అసోసియేషన్ తోపాటు ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మానవ అక్రమ రవాణా అతిపెద్ద నేరం



మాట్లాడుతున్న బాలరామకృష్ణ

నాగార్జునసాగర్: ఉద్యోగాలు ఇప్పిస్తాం, సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామంటూ మహిళలు, యువతులకు డబ్బు ఆశ చూపి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించి వ్యభిచార గృహాలకు విక్రయిస్తున్నారని, ఇది అతిపెద్ద నేరమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ మేనేజర్ కె.బాలరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం సాగర్‌లోని బీసీ గురుకుల విద్యాలయంలో ఆ సంస్థకు చెందిన పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ సహకారంతో ప్రిన్సిపాల్ రవీంద్రాచారి, రజనీకర్ ఆధ్వర్యంలో విద్యార్థుల చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలను అపహరించి వారి శ్రమను దోచుకోవడంతో పాటు అవసరం మేరకు అవయావలను తొలగించి ఇతరులకు విక్రయిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల సాయంతో ఇప్పటివరకు 28,200మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి పురావాసం కల్పించామన్నారు. సెల్ మెసేజ్‌లు, వ్యక్తులపై అనుమానమొస్తే 1930నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రావ్యస్మృతి, శివ, అనిల్, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

పోలింగ్ సజావుగా కొనసాగాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ.కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: అసెంబ్లీ సాధారణ ఎన్నికల పోలింగ్ సజావుగా కొనసాగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సామగ్రి తరలింపునకు బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు అవినాష్ చంపావత్, ఆర్.కన్నన్, కె.బాలసుబ్రహ్మణ్యం, ఎస్పీ అపూర్వరావు సమక్షంలో సిబ్బందికి పోలింగ్ స్టేషన్ల వారీగా విధులు కేటాయించారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తిచేశామన్నారు. సమావేశంలో డీఈఓ భిక్షపతి, ఎన్ఐసీ అధికారి గణపతిరావు, ఏఓ మోతీలాల్, ఎలక్షన్ డిటి విజయ్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లిలోని గోదాంలో కౌటింగ్‌కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ కర్ణన్ పరిశీలించారు. ఆయనవెంట ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, సర్వేల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, పీఆర్‌ఈఈ తిరుపతయ్య, కమిషనర్ రమణాచారి, పరిశ్రమల జీఎం కోటేశ్వరరావు ఉన్నారు.

సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసినందున రాజకీయ పార్టీలు ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించవద్దని ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఒక ప్రకటనలో కోరారు. పోలింగ్ రోజు వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరు గుంపులుగా సంచరించవద్దని పేర్కొన్నారు. స్థానికేతరులు అంతా నియోజక వర్గాన్ని విడిచి వెళ్లాలని సూచించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఒపీనియన్ పోల్స్ లేదా ఇతర పోల్స్ ఫలితాలను ప్రదర్శించవద్దని పేర్కొన్నారు. ఎవరైనా మద్యం విక్రయాలు చేసినా, వాహనాల్లో ఓటర్లను తరలిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల మోడల్ కోడ్ ఉల్లంఘనపై సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేస్తే వంద నిమిషాల్లో పరిష్కరిస్తామని తెలిపారు.


భువనగిరి పట్టణంలోని అరోరా కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేసిన అధికారులు


నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచార వాహనానికి లైట్లు తొలగిస్తున్న దృశ్యం


నల్లగొండ పట్టణంలోని బోయవాడ పోలింగ్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



నార్కట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ స్టేషన్


నల్లగొండలో పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ రవి

● ఉత్సాహం ఉరకలు..


భువనగిరి: పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డికి మద్దతుగా కార్ల ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చివ్వెంల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి జగదీష్‌రెడ్డికి మద్దతుగా బి.చందుపట్ల గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తిరుమలగిరి(తుంగతుర్తి): ప్రచారంలో గులాబీ కండువా ఊపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్


అర్వపల్లి: డ్యాన్స్ చేస్తున్న గాదరి కిషోర్ సతీమణి కమల, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక తదితరులు


మిర్యాలగూడ: ర్యాలీలో కండువా ఊపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు


సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డ ప్రాంతంలో మంత్రి జగదీష్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న గౌడ సంఘం సభ్యులు

జంగ్ తెలంగాణ

అవినీతి ప్రభుత్వాన్ని తరిమేయాలి


దేవరకొండలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు


మాట్లాడుతున్న దేవేంద్ర ఫడ్నవీస్, చిత్రంలో బీజేపీ అభ్యర్థి లాలునాయక్

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో ఒరిగిందేమీ లేదు
- బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌ను గెలిపించాలి
- దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

దేవరకొండ: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమేయాలని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. మంగళవారం దేవరకొండలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌కు మద్దతుగా ఇక్కడికి వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే లాలునాయక్ ఇప్పటికే గెలిచినట్లు కనిపిస్తుందన్నారు. త్వరలోనే తెలంగాణలో బీజేపీ సర్కార్ ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ఏడాదికి ఉచితంగా నాలుగు సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే కాక ముందు ఐదెకరాలున్న ఇక్కడి ఎమ్మెల్యేకు ఇప్పుడు 500 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏ రోజు ఏ పార్టీలో ఉంటాడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగం రాకపోయినప్పటికీ.. కేసీఆర్ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ రాజకీయ ఉపాధి దొరికిందన్నారు. 2015లో తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రైతాంగానికి సాగునీరు కావాలని కేసీఆర్ తనను అడిగారని, దీంతో మహారాష్ట్ర నుంచి కాళేశ్వరానికి నీరిచ్చి తెలంగాణ రైతాంగానికి సహాయ సహకారాలు అందించానని గుర్తు చేశారు. కానీ, కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరుగుతుందని తనకు అప్పుడు తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పూర్తిగా వ్యతిరేకమని, తెలంగాణ రాష్ట్రాన్ని మేమే ఇచ్చామంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు.. కానీ ఎంతో మంది బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. బీజేపీ సైతం ప్రత్యేక తెలంగాణ కోసం పాటుపడిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి కావాలంటే బీజేపీతోనే సాధ్యపడుతుందన్నారు. కేతావత్ లాలునాయక్‌ను దేవరకొండ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

చిత్తశుద్ధితో పనిచేస్తా: కేతావత్ లాలునాయక్

తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి కేతావత్ లాలునాయక్ అన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ పార్కుతో పాటు దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సభలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, చీకోటి ప్రవీణ్, ప్రదీప్‌కుమార్, కర్నాటి సురేష్, గార్లపాటి జితేందర్, చెనమోని రాములు, అంకూరి నర్సింహ, దావ శ్రీను, నక్క వెంకటేశ్ యాదవ్, వనం జగదీశ్వర్, వినోద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, కళాకారులు


ప్రజలకు అభివాదం చేస్తున్న బృందాకారత్, చిత్రంలో సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్

హుజూర్‌నగర్: ప్రజాస్వామ్యం, ధనస్వామ్యం మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేసి సీపీఎంను గెలిపించాలని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరుతూ మంగళవారం పట్టణంలో రోడ్డుషో, ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ఇంతకుముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ వారు గెలిచి చేసిందేమీ లేదని ఆరోపించారు. పేదల పక్షాన పోరాటం చేసే సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని ఆశీర్వదించాలని కోరారు. మల్లు లక్ష్మిని గెలిపిస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. మల్లు లక్ష్మి మాట్లాడుతూ దళితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించిందని, ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే మండలాల్లో రైతుల కోసం శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు పారేపల్లి శేఖర్‌రావు, కోట రమేష్, నెమ్మాది వెంకటేశ్వర్లు, పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండు, కౌన్సిలర్ త్రివేణి, ఏకలక్ష్మి, శ్రీకాంత్‌వర్మ, వెంకటరెడ్డి, యాదగిరిరావు, వీరస్వామి, మురళి బ్రహ్మం, యోనా, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు. కాగా.. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్‌షోలో అరుణ పతాకాలతో హుజూర్‌నగర్ పట్టణం ఎరుపెక్కింది. డప్పు చప్పుళ్లు, కోలాట నృత్యాలు, ఆట పాటలతో కళాకారులు సందడి చేశారు. రోడ్ షో, కార్నర్ మీటింగ్‌తో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది.

కోళ్ల దాణా లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

మాడుగులపల్లి: కోళ్ల దాణా బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన మాడుగులపల్లి మండల పరిధిలోని టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి కోళ్ల దాణా(సోయాపొట్టు) బస్తాల లోడ్‌తో లారీ ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లాకు బయల్దేరింది. మార్గమధ్యలో మాడుగులపల్లి టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు దిగుడుగా ఉండడాన్ని డ్రైవర్ గుర్తించకపోవడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. దాణా బస్తాలను మరో లారీలోకి లోడ్ చేసి క్రేన్ సాయంతో బోల్తా పడిన లారీని పైకెత్తారు.

డీజే సౌండ్‌తో గుండెపోటుకు గురై మహిళ మృతి


అమృతమ్మ(ఫైల్)

కొండమల్లేపల్లి: దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లిలో ఓ రాజకీయ పార్టీ ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో డీజే సౌండ్ కారణంగా ఓ మహిళ గుండెపోటుకు గురై మృతి చెందింది. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన గుంటోజు అమృతమ్మ(51) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోర్ పిస్ డిజే సౌండ్స్‌తో తీవ్రమైన శబ్దాన్ని తట్టుకోలేక అమృతమ్మ గుండెపోటుకు గురై కుప్పకూలింది. దీంతో స్థానికులు ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమృతమ్మను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు ఏమీ అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పెద్దవూర : మండలంలోని బట్టుగూడెంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి శ్రీఇష్ట కామేశ్వరి, ఆంజనేయ సహిత అయ్యప్ప దేవాలయ ఆవరణలో అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలాధారణస్వాములు మహాపడిపూజను తాంత్రిక్ రామారావు గురుస్వామి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 18 మెట్లను ఏర్పాటు చేసి జ్యోతులను వెలిగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమకు జిల్లాకు చెందిన రాజేశ్ గురుస్వామి బృందం పాడిన భక్తి గీతాలు భక్తులను ఉర్రూతలూగించాయి.గ్రామానికి చెందిన నక్కల విజయేందర్‌రెడ్డి 2500 మంది భక్తులకు అల్పాహారాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డిలు మహా పడిపూజ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పడి ముట్టిస్తున్న భక్తులు

మోదీ, కేసీఆర్.. ఇద్దరూ ఒక్కటే


సమావేశానికి హాజరైన ముస్లింలు


మాట్లాడుతున్న ఇమ్రాన్ ప్రతాప్ గర్హి పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ గర్హి

నల్లగొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్.. ఇద్దరూ ఒక్కటేనని ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ గర్హి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మద్దతుగా ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మైనార్టీల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ తన కుటుంబం కోసం ప్రగతి భవన్‌లో 20 బెడ్‌రూంలు కట్టుకున్నాడే తప్ప.. పేదలకు ఎక్కడా కూడా డబల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించలేదని అన్నారు. సీబీఐ రాష్ట్రంలోని అన్ని పార్టీల నాయకుల ఇళ్లపై దాడులు చేస్తున్నా.. కేసీఆర్ కుటుంబంపై ఎక్కడా దాడి చేసిన దాఖలాలు లేవని అన్నారు. కేసీఆర్ తాను చెప్పుకుంటున్నట్లు సెక్యులర్ మనిషి కాదని.. ఆయన మోదీ మనిషి అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీలంతా ఏకతాటిపై నిలబడి నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బై బై కేసీఆర్ అంటూ పాట పాడి అక్కడికి వచ్చిన ముస్లిం మైనార్టీలందరిలో జోష్ నింపారు. నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో

కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. ఐదేళ్లు గోస తప్పదు


త్రిపురారం: భగత్ రోడ్ షోలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్

హాలియా: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే..ప్రజలకు ఐదేళ్ల గోస తప్పదని నాగార్జునసాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ అన్నారు. మంగళవారం హాలియాలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్ రెడ్డితో కలిసి నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేస్తే పాముకి పాలు పోసినట్టేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు బాబురావు నాయక్, బ్రహ్మారెడ్డి, అనుముల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తెలంగాణను కాంగ్రెస్ చేతిలో పెట్టొద్దు

త్రిపురారం: తొందరపడి తెలంగాణను కాంగ్రెస్ చేతిలో పెట్టొదని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం త్రిపురాం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి శివాలయం వరకు నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్‌తో కలిసి నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్, అంజయ్య యాదవ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ జయరాం నాయక్ పాల్గొన్నారు.

నిడమనూరు అభివృద్ధికి ఎంతో కృషి

నిడమనూరు: నిడమనూరు అభివృద్ధికి ఎంతో కృషి చేశామని బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నిడమనూరులో రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, మార్కెట్ చైర్మన్ చంద్రారెడ్డి, రవి, సైదులు, వెంకటేశ్వర్లు, వెంకన్న పార్టీ మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే, పక్కన బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్

- కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే

నల్లగొండ టూటౌన్: నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధి డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యమని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. మంగళవారం ఆమె నల్లగొండ పట్టణం 11వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కేసీఆర్ సర్కార్‌ను ఇంటికి సాగనంపాలని, అధికార మదంతో మాట్లాడుతున్న కేసీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా పాతర వేసి తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవం నిలబెట్టుకోవాలన్నారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, ధరణి వంటి వాటితో వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ ప్రభుత్వం అవినీతిరహిత పాలన అందిస్తుందన్నారు. రైతులకు ధాన్యం మద్దతు ధర రూ.3100 ఇస్తామని, విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని, కేంద్రం ఇస్తున్న ఇళ్లను కూడా కేసీఆర్ ప్రభుత్వం పేదలకు ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారు ప్రసాద్, పోతెపాక సాంబయ్య, కంకణాల నాగిరెడ్డి, కంకణాల లక్ష్మమ్మ, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, బొజ్జ నాగరాజు, దాసరి సాయి, పెరిక మునికుమార్, ఏరుకొండ హరి, దినేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.